సంక్షిప్త వార్తలు

■ **పుస్తకావిష్కరణ**

పాత గుంటూరు: బ్రాడీపేటలోని ఎస్ హెచ్ ఓ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ అశ్లీలత ప్రతిఘటన వేదిక ఆధ్వర్యంలో శనివారం ప్రముఖ రచయిత ఈదర గోపీచంద్ సంపాదకీయంలో కామోత్సవ దహనం పుస్తకావిష్కరణ సభ శనివారం నిర్వహించారు. సభకు విరసం సభ్యులు నల్లూరి రుక్మిణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా అరసం జాతీయ నేత పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ రావి రంగారావు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

■ **ఉపకార వేతనాలు పంపిణీ**

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యానగర్ లోని ఓ కల్యాణ మండపంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలలో ప్రభుత్వ కళాశాలల్లో తమ ప్రతిభ కనబరుస్తున్న 167 మంది పేద విద్యార్థులకు రూ.14 లక్షల 78 వేలు ఉపకార వేతనాలు పంపిణీ చేసి మలబార్ గోల్డ్ అందిస్తున్న సేవలను కొనియాడారు.

■ **దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ**

నెహ్రూనగర్: గుంటూరు తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ఆ పార్టీకి చెందిన దివ్యాంగ నాయకులు బండారు దుర్గారావు పేర్కొన్నారు. తూర్పులో నూరీ ఫాతిమా అఖండమైన మెజార్టీతో గెలవాలని కోరుతూ, ఆమెకు దివ్యాంగుల ఆశీస్సులు ఉండాలని కోరుతూ శనివారం అంబేడ్కర్ భవన్‌లో వంద మంది దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దివ్యాంగుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను తిరిగి సీఎం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వికలాంగుల విభా గం జిల్లా అధ్యక్షుడు నూర్‌బాషా అల్లాబక్షు పాల్గొన్నారు.

వంగవీటి మోహన రంగా ఒక శక్తి



విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రి రజిని, మేయర్ మనోహర్, వంగవీటి రాధ

నెహ్రూనగర్: వంగవీటి మోహన రంగా ఒక వ్యక్తి కాదని.. ఆయన ఒక శక్తి అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినీ పేర్కొన్నారు. శనివారం గుజ్జనగుండ్లలో రంగా విగ్రహావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వంగవీటి రాధా, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజినీ మాట్లాడుతూ వంగవీటి రంగాను ఒక వర్గానికి మాత్రమే పరిమితం చేయలేమన్నారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, వంగవీటి తనయుడు రాధా పాల్గొన్నారు.

క్లోరిన్ శాంపిల్స్ తప్పనిసరిగా సేకరించాలి

నెహ్రూ నగర్: తాగునీటి సరఫరా సమయాల్లో ఎమినిటి కార్యదర్శులు తప్పనిసరిగా వార్డ్‌లో అందుబాటులో తిరుగుతూ క్లోరిన్ శాంపిల్స్ సేకరించాలని నగరపాలక సంస్థ ఎస్.ఈ.(ఎఫ్ఏసి) సుందర్ రామిరెడ్డి తెలిపారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు శనివారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో వార్డ్ సచివాలయ ఎమినిటీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ నగరంలోని ఉదయం, సాయంత్రం జరిగే తాగునీటి సరఫరాను వార్డ్ సచివాలయాల వారిగా ఎమినిటీ కార్యదర్శులు తప్పనిసరిగా క్లోరిన్ శాంపిల్స్ సేకరించాలని, శాంపిల్స్ రిపోర్ట్‌లను స్థానికుల సంతకాలతో ప్రత్యేక రిజిస్టర్ నమోదు చేయాలన్నారు. క్లోరిన్ శాంపిల్స్‌లో ఎక్కడైనా తాగునీటి కాలుష్యం గుర్తిస్తే వెంటనే ఉన్నతాధికారులకు తెలియచేయాలన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ డి.దేవానంద్ రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దే శక్తి విద్యకు ఉందని ఏపీ ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ డి.దేవానంద్ రెడ్డి అన్నారు. శనివారం గోరంట్లలోని భాష్యం రామసేతు క్యాంపస్‌లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థిలో భవిష్యత్‌ను ఉన్నతంగా మలచు కునే శక్తి ఉందని గ్రహించి, అందుకు అనుగుణంగా కృషి చేయడం ద్వారా జీవితంలో ఉన్నతంగా స్థిర పడవచ్చని అన్నారు. విద్యార్థులు విలువైన సమయాన్ని వృధా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదవగలిగితే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల మార్గదర్శనంలో అందిస్తున్న బోధనతో పాటు వారు ఇస్తున్న సూచనలు పాటిస్తూ ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

'భారత క్రికెట్ జట్టులో వంశీకి చోటు దక్కడం ఖాయం'

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈ నెల 18న కడపలో జరిగిన నాలుగు రోజుల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఒకే ఓవర్‌లో 6 సిక్స్‌లు సాధించిన మామిడి వంశీ కృష్ణ త్వరలోనే భారత జట్టులో స్థానం సంపాదిస్తాడని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమణమూర్తి, దాసరి రమేష్ కుమార్‌లు ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక అరండల్‌పేటలోని పిచ్చుకులగుంట క్రీడా మైదానంలో వంశీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రమణమూర్తి, దాసరి రమేష్ కుమార్‌లు మాట్లాడుతూ జిల్లా నుంచి రంజీ జట్టులో చోటు కోసం చాలా మంది పోటీపడుతున్నారన్నారు. ఇటీవల రషీద్ అండర్–19 భారత జట్టులో స్థానంతో పాటు రంజీ జట్టులోనూ చేరాడన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఎవ్వరూ సాధించని ఘనత సాధించాడని కొనియాడారు. అదే మ్యాచ్‌లో కేవలం 48 బంతుల్లోనే శతకం బాదిన తీరు అద్భుతమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రామకృష్ణ పరమహంస, అయితి సతీష్, సరస్వతీ రెడ్డి, ఇండ్ల భాస్కర్ పాల్గొన్నారు.

ధృవీకరణ పత్రాల రూపకల్పనలో వినూత్న ప్రక్రియ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ శనివారం ఆసుపత్రిలో వినూత్న ప్రక్రియకు నాంది పలికారు. జనన మరణ ధృవీకరణ పత్రాలు పొందే సమయంలో పలువురు పత్రాల్లో తప్పులు దొర్లి ఇబ్బంది పడుతున్నారు. వాటిని ముందస్తుగానే కట్టడి చేసి తప్పులు లేకుండా పత్రాలు ఇచ్చేలా వాట్సాయాప్ గ్రూపును ఏర్పాటు చేశారు. ఈమేరకు శనివారం సూపరింటెండెంట్ చాంబర్‌లో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, జనన మరణ ధృవీకరణ పత్రాలు మంజూరు చేసే మెడికల్ రికార్డు డిపార్టుమెంట్ (ఎంఆర్‌డీ), నర్సింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

పత్రాలను సంబంధిత కుటుంబ సభ్యులకు అందజేసే ముందు వారి ఆధార్ కార్డు తీసుకొని దాని ఆధారంగా పత్రాలను సిద్ధం చేసి కుటుంబ సభ్యుల వాట్సాయాప్ నంబరుకు పంపించాలని చెప్పారు. ఏమైనా తప్పులు ఉన్నాయా లేవా అనే విషయాలను వాట్సాయాప్ ద్వారా కుటుంబ సభ్యులు చూసుకుని వారు అంగీకారం తెలిపిన తరువాతనే ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లను అప్‌లోడు చేసి ప్రింట్ ఇవ్వాలన్నారు.

జనరల్ నోటీసు

G.W.O.P. No. 1 / 2024

వాయిదా తేది : 20-03-2024.

శ్రీ మట్టుపల్లి వెంకట సుబ్బారావు, పిటీషనర్ తరపు న్యాయవాది, అరండల్‌పేట, గుంటూరు.

అలరించిన శ్రీరామజననం హరికథా గానం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శ్రీ మదజ్జాడాది భట్ల నారాయణ దాస కథాగాన కళాపరిషత్ ఆధ్వర్యంలో శ్రీ నారాయణ దాస 159వ జయంతి, 79 వ వర్ధంతి సభ నిర్వహించారు. రాజహంస జయంతి సావిత్రి శ్రీరామ జననం పై నిర్వహించిన హరికథాగానం అలరించింది.

పాత పింఛన్ అమలు చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ పేర్కొన్నారు. శనివారం బ్రాడీపేటలోని సంఘ జిల్లా కార్యాలయంలో ఓట్ ఫర్ ఓపీఎస్ పేరుతో గోడప్రతులు, బుక్‌లెట్ ఆవిష్కరించారు. ప్రతి ఉద్యోగి బుక్‌లెట్ చదివాలని, సీపీఎస్, జీపీఎస్, ఓపీఎస్‌లకు సంబంధించిన పూర్తి వివరాలు ఇందులో పొందుపర్చినట్లు తెలిపారు. సీపీఎస్ విధానంలో పెన్షన్ పొందుతున్న పెన్షనర్ల దయనీయ పరిస్థితులు పుస్తకంలో డేటాతో సహా వివరించినట్లు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓపీఎస్ అంశం ప్రభావితం చేస్తుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు, సంఘ జిల్లా సహాధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, జి. వెంకటేశ్వరరావు, ఎం. గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యానికి భద్రత



ఆర్టీసీ బస్టాండ్‌లో చెత్త వ్యర్థాలను సేకరించిన వివిధ డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: పరిసరాల పరిశుభ్రతతో మన ఆరోగ్యానికి భద్రత ఉంటుందని ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగ సమన్వయకర్త డాక్టర్ డి.రవిశంకర్ రెడ్డి అన్నారు. ఏఎన్‌యూ జాతీయ సేవా పథక ఆధ్వర్యంలో శనివారం గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో శ్రమదానం చేసిన వివిధ డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్లాస్టిక్ బాటిల్స్, చెత్త వ్యర్థాలను సేకరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ సామాజికసేవలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బాధ్యతతో పాల్గొనమే కాకుండా ఉత్సాహంగా ఇటువంటి కార్యక్రమాలు చేస్తారని అన్నారు.